ఎర్ర కోట కాదు..ఎగ్జిబిషన్ గోడ

పై చిత్రాన్ని చూసి ఎర్రకోట అనుకుంటున్నారా..అయితే మీరు త(ప)ప్పులో కాలేసినట్లే..ఎందుకంటే ఇది ఎర్రకోట మాదిరిగా రూపుదిద్దుకున్న ఎగ్జిబిషన్ ఆవరణ చుట్టూ ఏర్పాటు చేసిన గోడ. కార్మిక క్షేత్రంలో నిర్వహించనున్న ఎగ్జిబిషన్ కోటను 'ఖని'వాసులు తదేకంగా చూస్తూ మైమరిచిపోతున్నారు.

– కోల్‌సిటీ, డిసెంబర్ 30

అర్హులందరికీ ఆరు గ్యారెంటీలు

- పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు
- పలు మండలాల్లో ప్రజాపాలన సభలకు హాజరు



జూలపల్లి: వడ్కాపూర్‌లో దరఖాస్తు తీసుకుంటున్న ఎమ్మెల్యే విజయరమణారావు

జూలపల్లి/సుల్తానాబాద్‌రూరల్/పెద్దపల్లి రూరల్, డిసెంబర్ 30: 'అర్హులందరికీ ఆరు గ్యారెంటీలు అంది స్తాం..గూడులేని పేదలకు ఇండ్లు మంజూరు చేస్తాం' అంటూ పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు హామీ ఇచ్చారు. శనివారం జూలపల్లి మండలం తేలుకుంట, వడ్కాపూర్, సుల్తానాబాద్ మండ లం రేగడిమద్దికుంట, చిన్న కల్వల, ఐతరాజ్‌పల్లి, దుబ్బపల్లి, పెద్దపల్లి మండలం గుర్రాంపల్లిలో ప్రజాపాలన గ్రామసభలకు హాజరై ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ గృహావసరాలకు ప్రజలు మట్టి, ఇసుక తరలిస్తే అడ్డుకోవద్దని అధికారులకు సూచించారు. పారదర్శకంగా పథకాలను అమలు చేస్తామని చెప్పారు. కాగా, ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత జూలపల్లి మండలానికి తొలిసారిగా వచ్చిన ఎమ్మెల్యేను స్థానిక ప్రజాప్రతినిధులు ఘ నంగా సన్మానించారు. కార్యక్రమాల్లో ఎంపీపీలు కూసుకుంట్ల రమాదేవి, పొన్నమనేని బాలాజీ రావు, జూలపల్లి వైస్ ఎంపీపీ మొగురం రమేశ్, సర్పంచులు పద్మ, తిరుపతి, నరసింహం, రవీందర్ రెడ్డి, రమేశ్‌గౌడ్, దేవమ్మ, శ్రావణ్‌కుమార్, ఎంపీటీసీ శ్రీనివాస్, రాజామణి, సంపత్‌గౌడ్, విజయ పాల్గొన్నారు.

అల్ఫోర్స్ న్యూఇయర్ వేడుకల్లో నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

అల్ఫోర్స్‌లో నూతన సంవత్సర వేడుకలు

సుల్తానాబాద్, డిసెంబర్ 30: పాత సంవత్సర చేదు జ్ఞాపకాలను వదిలేస్తూ, కొత్త సంవత్సరంలో మీ జీవితాల్లో వెలుగులు నిండాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి అకాంక్షిస్తూ విద్యార్థులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా శనివారం సుల్తానాబాద్‌లోని అల్ఫోర్స్ పాఠశాలలో ముందస్తుగా నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడారు. కొత్త సంవత్సరంలో శాంతి, సంపద, అరోగ్యాంగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా విద్యార్థులు నృత్యాలు చేస్తూ, ప్రత్యేక అకర్షణగా నిలిచారు. విద్యార్థులు ఒకరికి ఒకరూ నూతన సంవత్సర శుభాకాంక్షాలు తెలిపారు.

సీఎంఆర్ రైస్ డెలివరీ లక్ష్యం పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్ లాల్ సమీక్ష

పెద్దపల్లి, డిసెంబర్30: సీఎంఆర్ రైస్ డెలివరీ లక్ష్యం పూర్తి చేయాలని, ప్రతి రోజూ రైస్ మిల్లులు పూర్తి సామర్థ్యంతో నడిచి, రోజువారి రైస్ డెలివరీ లక్ష్యాలను పూర్తి చేసే విధంగా పర్యవేక్షించాలని అధికారులను అదనపు కలెక్టర్ జీవీ శ్యాం ప్రసాద్ లాల్ ఆదేశించారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సూచనల మేరకు శనివారం అధికారులతో అదనపు కలెక్టర్ సీఎంఆర్‌పై సమీక్షించారు. రైస్ డెలివరీలో వెనుకబడుతున్న మిల్లులను గుర్తించి అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి ప్రేమ్ కుమార్, పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. కాగా అంతకుముందు సచివాలయం నుంచి కలెక్టర్లు, పౌర సరఫరాల శాఖ అధికారులతో కష్టం మిల్లింగ్ రైస్ వానకాలం, యాసంగిపై రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. పెద్దపల్లి సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్ శ్యాం ప్రసాద్‌లాల్ పాల్గొన్నారు.

శాంతియుత వాతావరణంలో వేడుకలు జరుపుకోవాలి

- రామగుండం పోలీసు కమిషనర్ రెమో రాజేశ్వరి

ఫర్టిలైజర్‌సిటీ, డిసెంబర్ 30: నూతన సంవత్సర వేడుకలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని రామగుండం పోలీసు కమిషనర్ రెమో రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. నేటి(31వ తేదీ) రాత్రి 10 గంటల నుంచి స్పెషల్ డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తామని, పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేసి బైండోవర్ చేస్తామని హెచ్చరించారు. ఇతరుల మనోభావాలకు ఇబ్బంది లేకుండా, ప్రమాదాలకు దూరంగా, పోలీసు కమిషనర్ జారీ చేసిన సూచనలకు అనుగుణంగా వేడుకలు నిర్వహించుకోవాలని సూచించారు. ఆరుబయట మద్యం తాగడం, గుంపులుగా తిరుగుతూ మహిళలను వేధింపులకు గురి చేసే వారిపై పోలీసు పెట్రోలింగ్‌తో పర్యవేక్షణ ఉంటుందన్నారు. 31వ తేదీ అర్ధరాత్రి 12.30 నిమిషాలకు వేడుకలను ముగించుకోవాలన్నారు. ఆర్కెస్ట్రా, డీజేలు, మైకులు ఉపయోగించడం, పటాకులు కాల్చడం నిషేధమన్నారు. వేడుకలకు పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు.

యువజనోత్సవాలతో ప్రతిభ వెలికితీత



జానపద నృత్య, గేయ పోటీల్లో గెలుపొందిన వారితో అరుణ శ్రీ

పెద్దపల్లి, డిసెంబర్ 30: యువతీ, యువకులు తమలోని ప్రతిభను ప్రదర్శించేందుకు యువజనోత్సవాలు చక్కటి వేదికగా నిలుస్తాయని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే అరుణశ్రీ అన్నారు. శనివారం ఉదయం స్థానిక అమర్ చంద్ కల్యాణ మండలంలో యువజనోత్సవాలను జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి సురేష్, స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ముగింపు కార్యక్రమంలో అరుణశ్రీ పాల్గొని మాట్లాడారు. అనంతరం జానపద నృత్య, గేయ పోటీల్లో గెలుపొందిన వారికి మెమోంటోలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. యువజనోత్సవాలకు న్యాయ నిర్ణేతలుగా జాతీయ అవార్డు గ్రహీతలు ఈదునూరి శంకర్, కొండా రవి, ఆంజనేయులు, కనకయ్య, నరసింగం వ్యవహరించారు.

కిరాణాషాపునకు వచ్చి కూప్పకూలి..

- సింగరేణి రిటైర్డ్ కార్మికుడి హఠాన్మరణం

మృతి చెందిన సమ్మయ్య

మంథని రూరల్, డిసెంబర్ 30: సామగ్రి కొనుగోలుకు కిరాణాషాపునకు వచ్చిన సింగరేణి కార్మికుడు అక్కడే కుప్పకూలాడు. దుకాణం గోడకు ఒరిగిపోయి హఠాన్మరణం చెందాడు. శనివారం మంథనిలో జరిగిన ఘటన చల్లపల్లిలో విషాదం నింపింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..మంథని మండలం చల్లపల్లికి చెందిన సింగరేణి రిటైర్డ్ కార్మికుడు సమ్మయ్య శనివారం కిరాణా సామగ్రి కొనుగోలుకు శనివారం ఉదయం మంథని మార్కెట్ ఏరియాలోని ఓ దుకాణానికి వచ్చాడు. మూసి ఉన్న షాపు గొడకు ఒరిగిపోయి అచేతనంగా కూర్చుండిపోయాడు. కొంతసేపటి తర్వాత స్థానికులు గమనించి లేపేందుకు యత్నించగా కదల్లేదు. దగ్గరికి వెళ్లి చూడగా శ్వాస ఆగిపోవడాన్ని గమనించి మరణించాడని నిర్ధారణకొచ్చారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని కుటుంబీకులకు తెలియజేశారు. వారు హుటాహుటిన అక్కడికి చేరుకొని కన్నీరుమున్నీరయ్యారు. సమ్మయ్యకు భార్య రాజేశ్వరి, కూతురు దేవేంద్ర ఉన్నారు.

పాఠశాలల్లో ఫుడ్ ఫెస్టివల్

పెద్దపల్లి కమాన్/జ్యోతినగర్/యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబర్ 30: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని పెద్దపల్లి గాయత్రి విద్యానికేతన్, ఎన్టీపీసీ విశ్వభారత్ హైస్కూల్, పారిశ్రామిక ప్రాంతంలోని శ్రీవాణి పాఠశాలలో శనివారం విద్యార్థుల తల్లిదండ్రులకు, చిన్నారులకు ఫుడ్ ఫెస్టివల్, ఆటల పోటీలు నిర్వహించారు. పోటీల్లో భాగంగా పేరెంట్స్, చిన్నారులు తీసుకొచ్చిన మిల్లెట్ ఇడ్లి, డ్రై ఫ్రూట్ బేల్ పూరీ, క్రంచీ బ్యాగ్స్, అప్రికాట్ స్వీట్, రబ్డి మాల్పు, ఆలు పోహా, పన్నీరు మంచూరియా, మిల్మేకర్ మంచూరియా, శీర్ ఖుర్మాతో పాటు దాదాపు 200కు పైగా వంటకాలు అందర్ని ఆకర్షించాయి. అనంతరం వన్ మినట్ గేమ్ షో తదితర ఆటలు ఆడించారు. ఆయా కార్యక్రమాల్లో గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్, కరస్పాండెంట్ అల్లెంకి రజిని, విశ్వభారత్ హైస్కూల్ చైర్మన్ బందారపు యాదగిరిగౌడ్, హెచ్ఎం తిరుపతిగౌడ్, శ్రీవాణి పాఠశాల కరస్పాండెంట్ లక్ష్మణ్ కుమార్, హెచ్ఎం మానస పాల్గొన్నారు.

పాఠశాలల్లో న్యూ ఇయర్ వేడుకలు

ముత్తారం/ఫర్టిలైజర్‌సిటీ/జ్యోతినగర్, డిసెంబర్ 30: గోదావరిఖని ఎల్‌బీ నగర్‌లో గల ఇండో అమెరికన్ పాఠశాల (ఐఏఎస్), ముత్తారం మండలం ఓడేడ్‌లోని ప్రభుత్వ పాఠశాలలో నూతన సంవత్సర వేడుకలను ముందస్తుగా నిర్వహించారు. విద్యార్థులు పాటలకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ, ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఐఏఎస్ పాఠశాలలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో, ఓడేడ్‌లోని ప్రభుత్వ పాఠశాలలో కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేసుకున్నారు. అనంతరం విద్యార్థులకు నూతన సంవత్సర క్యాలెండర్లను పంపిణీ చేశారు. కాగా శనివారం రాత్రి టౌన్‌షిప్‌లోని జ్యోతిక క్లబ్ లలితా కళా ప్రాంగణంలో ఎన్టీపీసీ యాజమాన్యం నిర్వహించిన ఆనంద్ మేళా వేడుకలు అలరించాయి. ఎన్టీపీసీ సదర్ రీజియన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చటోపాధ్యాయ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేయగా వేడుకలు ప్రారంభమయ్యాయి.

జ్యోతినగర్: టౌన్‌షిప్‌లో అలరించిన ఆనంద్ మేళా వేడుకలు

వేంకటేశ్వర ఆలయంలో ధనుర్మాస వేడుకలు

- గోదాదేవీకి సారే నిర్వహించిన భక్తులు

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబర్ 30: ధనుర్మాసాన్ని పురస్కరించుకుని పట్టణములోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం స్వామి మూలవిరాట్‌కు, గోదాదేవీకి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు గోవర్ధనగిరి జగన్నాథానాచార్యులు, మధుసూధనాచార్యులు ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చరణ మధ్య గోదాదేవీకి భక్తులు సారే, పండ్లు, వస్త్రాలు అందజేశారు. జనవరి 14న జరిగే గోదాదేవీ కల్యాణంలో భాగంగా గోదాదేవీకి ఘనంగా సారే కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భానుచార్యులు, కోశాధికారి రాధాకృష్ణ, వికాస తరంగణి పాల్గొన్నారు.

అమ్మవారికి సారే అందజేస్తున్న భక్తులు

బేబీ ఫీడింగ్ క్యాబిన్ ఏర్పాటు అభినందనీయం

జగిత్యాల ఆర్టీసీ డిపో మేనేజర్ సునీతను సన్మానిస్తున్న క్లబ్ సభ్యులు

ధర్మారం, డిసెంబర్ 30: అలయన్స్ క్లబ్ అధ్వర్యంలో బేబీ ఫీడింగ్ క్యాబిన్ ఏర్పాటు అభినందనీయమని జగిత్యాల ఆర్టీసీ డిపో మేనేజర్ సునీత అన్నారు. అలయన్స్ క్లబ్ ప్రోత్సాహంతో ధర్మారం మండలకేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో మండల కేంద్రానికి చెందిన సత్యనారాయణ, రైస్ మిల్ యజమాని సిరిపురం పద్మ–గంగన్న దాతల సౌజన్యంతో రూ.40 వేల వ్యయంతో సిరిపురం విశ్వనాథం జ్ఞాపకార్థం బేబి ఫీడింగ్ క్యాబిన్ (తల్లి పాలిచ్చు గది)ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బేబి ఫీడింగ్ క్యాబిన్‌ను డీఎం సునీత ప్రారంభించారు. మానవతా దృక్పథంతో దాతలు క్యాబిన్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా డిపో మేనజర్‌ను క్లబ్ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ 258 అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ జాయింట్ ట్రెజరర్, సౌత్ మల్టీపుల్ కౌన్సిల్ ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్ సిరిపురం సత్యనారాయణ, జిల్లా గవర్నర్ సిరిపురం రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లో ముగ్గురికి కరోనా

జ్యోతినగర్, డిసెంబర్ 30: ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లో ముగ్గురికి కరోనా పాజిటివ్ వచ్చింది. ఎన్టీపీసీలో ఉద్యోగం చేస్తున్న కేరళకు చెందిన వ్యక్తి ఇటీవల తన సొంతరాష్ట్రానికి వెళ్లివచ్చాడు. అతడితో పాటు కూతురుకు సైత కరోనా లక్షణాలు కనిపించడంతో గురువారం ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లోని ధన్వంతరి దవాఖానలో పరీక్షలు చేశారు. శనివారం వచ్చిన రిపోర్టుల్లో పాజిటివ్‌గా నిర్ధారణ అయిందని పెద్దపల్లి జిల్లా వైద్యాధికారి డాక్టర్ ప్రమోద్‌కుమార్ తెలిపారు. అలాగే మరో వ్యక్తికి కూడా కరోనా పాజిటివ్‌గా తేలిందని వెల్లడించారు.

పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి

గోదావరిఖని, డిసెంబర్ 30: సింగరేణిలోని కార్మికుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్ డైరెక్టర్లను కోరారు. ఈమేరకు హైదరాబాద్‌లో డైరెక్టర్లు బలరాం నాయక్, ఎన్‌వీకే శ్రీనివాస్‌ను సెంట్రల్ క్యాంపెనింగ్ ఇన్‌చార్జి వికాస్‌కుమార్‌తో కలిసి వినతి పత్రం అందజేశారు. ఆర్జీ–1,2, శ్రీరాంపూర్ ఏరియాల్లో సురక్షిత తాగు నీటి వసతి కల్పించాలన్నారు. రాపిడ్ గ్రావిటీ యాత్రల ఏర్పాటు కోసం గతంలో ఐఎన్టీయూసీ పోరాటాల ఫలితంగా రూ.20 కోట్లు మంజూరైనా ఇప్పటివరకు టెండర్ పూర్తి కాలేదన్నా రు. అలాగే మెడికల్ బోర్డులో జరిగే అవినీతిని అరికట్టి పారద ర్శకంగా నిర్వహించాలన్నారు. సింగరేణి వ్యాప్తంగా ఉన్న పలు సమస్యలపై చర్చించారు.

సమ్మక్క-సారలమ్మ జాతర కమిటీ ఎన్నిక

ధర్మారం, డిసెంబర్ 30: బొట్లవనపర్తి గ్రామ సమ్మక్క సారలమ్మ జాతర నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఫిబ్రవరిలో జరిగే జాతరను పురస్కరించుకుని శనివారం సర్పంచ్ రెడపాక ప్రమీలా శ్రీనివాస్ అధ్యక్షతన కమిటీని నియమించారు. కమిటీ గౌరవాధ్యక్షులుగా బొట్లవనపర్తి, బుచ్చయ్యపల్లి సర్పంచులు రెడపాక ప్రమీలాశ్రీనివాస్, ఇమ్మడిశెట్టి కొమురయ్య, కమిటీ చైర్మన్‌గా ఆకారి అంజయ్య, వైస్ చైర్మన్లుగా దారవేణి సాగర్, ఆవుల రవి, ప్రధాన కార్యదర్శిగా ఆకారి అనిల్, సంయుక్త కార్యదర్శిగా నేరెళ్ల నరేశ్, కోశాధికారిగా తాడూరి రఘు, ప్రచార కార్యదర్శిగా రెడపాక లక్ష్మణ్, కార్యవర్గ సభ్యులుగా మహాదేవుని మల్లేశం, నేరెళ్ల సతీశ్, సించు హనుమంతు, వాలుక సాగర్, మిట్ట మల్లేశంను ఎన్నుకున్నారు.

మంత్రిని కలిసిన సతీశ్

పెద్దపల్లి, డిసెంబర్ 30: రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను, పెద్దపల్లి జిల్లాకు చెందిన కాంగ్రెస్ నాయకుడు కొండి సతీష్ శనివారం హైదరాబాద్‌లో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

లీగల్ సర్వీసెస్ అథారిటీతో ఉచిత న్యాయ సేవలు

- ప్రిన్సిపల్ జిల్లా, సెషన్స్ జడ్జి కం చైర్మన్ లీగల్ సర్వీసెస్ అథారిటీ హేమంత్‌కుమార్
- జిల్లాలోని కోర్టుల్లో జాతీయ లోక్ అదాలత్

పెద్దపల్లి కమాన్: మాట్లాడుతున్న జిల్లా జడ్జి హేమంత్‌కుమార్

పెద్దపల్లి కమాన్/సుల్తానాబాద్/మంథని, డిసెంబర్ 30: లీగల్ సర్వీస్ అథారిటీ అందించే ఉచిత న్యాయ సేవలపై అవగాహన పెంచుకోవాలని, సామాన్య ప్రజలకు సైతం లీగల్ సర్వీస్ అథారిటీ గురించి తెలిసేలా విస్తృత ప్రచారం చేయాలని ప్రిన్సిపల్ జిల్లా, సెషన్స్ జడ్జి కం చైర్మన్, లీగల్ సర్వీసెస్ అథారిటీ డి. హేమంత్‌కుమార్ అధికారులకు సూచించారు. శనివారం పెద్దపల్లిలోని రంగంపల్లి కోర్టు ఆవరణలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి ఎం. అర్జున్‌తో కలిసి జడ్జి పాల్గొన్నారు. లోక్ అదాలత్‌లో వచ్చిన కేసులను జడ్జి హేమంత్‌కుమార్ పరిశీలించి మాట్లాడారు. వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు తప్పకుండా పాటించాలన్నారు. లోక్ అదాలత్‌లో పలు క్రిమినల్, చెక్‌బౌన్స్, కుటుంబ తగాదాలు, భార్యాభర్తల వివాద కేసులు, డ్రంకెన్‌డ్రైవ్ కేసులకు సంబంధించి పలు కేసులను పరిష్కరించినట్లు తెలిపారు. జాతీయ, రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో లీగల్ సర్వీస్ అథారిటీలు ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు తెల్ల కాగితంపై దరఖాస్తు సమర్పిస్తే వారికి న్యాయవాదిని ఏర్పాటు చేసి ఉచిత న్యాయ సేవలు అందిస్తామన్నారు. సుల్తానాబాద్ కోర్టు ప్రాంగణంలో మండల న్యాయసేవాధికారం సంస్థ ఆధ్వర్యంలో లోక్ అదాలత్ నిర్వహించగా జడ్జి జీఎస్ఎల్ ప్రియాంక పాల్గొన్నారు. క్రిమినల్, చెక్ బౌన్స్, కుటుంబ తగాదాలు, భార్యభర్తల విభేదాలు, డ్రంకెన్‌డ్రైవ్, ఇతర కేసులకు సంబంధించి 850 కేసులను పరిష్కరించినట్లు కోర్టు అధికారులు తెలిపారు. పలువురు న్యాయవాదులు వివిధ చట్టాలపై కక్షిదారులకు అవగాహన కల్పించారు. మంథని కోర్టులో సీనియర్ సివిల్ జడ్జి భారతి పలు క్రిమినల్, సివిల్ కేసులను పరిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో మంథని కోర్టు జూనియర్ సివిల్ జడ్జి గణేష్, పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎల్. భాస్కర్, భూసారపు బాలకిషన్‌ప్రసాద్, హరిబాబు, న్యాయవాదులు పాల్గొన్నారు.

పెద్దపల్లి ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంట్‌రెడ్డి

కేంద్రం విభజన హామీలు నెరవేర్చాలి

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

పెద్దపల్లి టౌన్, డిసెంబర్ 30: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తెలంగాణకు ఇచ్చిన విభజన హామీలను నెరవేర్చాటని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. వెంటనే కాజీపేటలో రైల్వేకోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని, ట్రైబల్ యూనివర్సిటీ స్థాపించాలని కోరారు. ఏడాదికి రెండుకోట్ల ఉద్యోగాలు ఇస్తామని గద్దెనెక్కిన ప్రధాని ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. శనివారం పెద్దపల్లి జిల్లాకేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో నిర్వహించిన సీపీఐ జిల్లా కౌన్సిల్ మీటింగ్‌కు హాజరై మాట్లాడారు. రామమందిరం పేరిట దేశాన్ని హిందుత్వ ఎజెండావైపు తీసుకెళ్తున్నారని ఆరోపించారు. వచ్చే సాధారణ ఎన్నికల్లో ఇండియా కూటమి ఘన విజయం సాధించడం ఖాయమని విశ్వాసం వ్యక్తం చేశారు. సింగరేణి ఎన్నికల్లో ఏఐటీయూసీని గెలిపించిన కార్మిక వర్గానికి విప్లవ జేజేలని పేర్కొన్నారు. ఇక్కడ నాయకులు కలవేన శంకర్, ఎల్ ప్రకాశ్, తాండ్ర సదానందం, గోసిక మోహన్, గౌతం గోవర్ధన్, కోడం స్వామి, ఉదయ్, మానస్‌కుమార్, సత్యనారాయణ, మల్లరెడ్డి, శంకర్ పాల్గొన్నారు.

విద్యుత్ మీటర్‌కు దరఖాస్తు చేసుకోవాలి

పెద్దపల్లి, డిసెంబర్30: ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ ప్రతి గృహానికి విద్యుత్ (కరెంట్) మీటర్ ఇవ్వాలని, మీటర్ లేని వారు మీ సేవాలో ఆధార్ కార్డు, మున్సిపల్, గ్రామ పంచాయతీ సర్టిఫికేట్, ఇంటి పర్మిషన్ పత్రాలు, నకలు కాపీలతో రిజిష్టర్ చేసుకోవాలని ఎస్‌పీడీసీఎల్ పెద్దపల్లి సూపరింటెండెంట్ బొంకూరి సుదర్శనం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీలు కుల ధ్రువీ కరణ పత్రాలు సమర్పిస్తే వారికి ప్రభుత్వం నుంచి 101 యూనిట్ల వరకు సబ్సిడీ వస్తుందన్నారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు సబ్సిడీ ఇస్తామని ప్రకటించిందన్నారు.

'ఖని'లో ఎస్ఐబీ, ఎస్పీల సమావేశం

ఫర్టిలైజర్‌సిటీ, డిసెంబర్ 30: రానున్న లోక్‌సభ ఎన్నికల నేపథ్య, ఇటీవల నూతన ఎస్ఐబీ(పోలీసు స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో) విభాగం నూతన డీఐజీగా బాధ్యతలు తీసుకున్న సుమతి శనివారం గోదావరిఖనిలో అంతర్ రాష్ట్ర సరిహద్దుల జిల్లాల ఎస్పీలతో, ఎస్ఐబీ అధికారులతో సమావేశం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో మావోయిస్టుల ఏరివేతకు తీసుకోవాల్సిన చర్యలు, ఇతర అంశాలపై చర్చించినట్లు తెలిసింది. ఇటీవల రామగుండం కమిషనరేట్ పరిధిలో పట్టుబడిన మావోయిస్టు దంపతులు, సికాస బాధ్యుల అంశంపై చర్చించారు. పెరుగుతున్న అర్బన్ నక్సలిజంపైన సమావేశం సాగినట్లు తెలిసింది.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

పెద్దపల్లి రూరల్, డిసెంబర్ 30: విధుల పట్ల ఎలాంటి నిర్లక్ష్యాన్ని ప్రదర్శించిన శాఖపరమైన చర్యలు తప్పవని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి వి.శ్రీధర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం పెద్దపల్లి మండలంలోని 30 గ్రామపంచాయతీల పరిధిలో జరిగిన జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనులపై అధికారులు సామాజిక తనిఖీలు చేపట్టారు. ఆయా గ్రామాల్లో పనులు చేపట్టి బిల్లులు చెల్లింపుల్లో రూ.59, 668 వివిధ పద్దుల కింద తేడాలు రావడంతో సంబంధిత బాధ్యుల నుంచి రికవరీ చేసేందుకు ఆదేశాలు జారీ చేశారు.

సింగరేణిలో సివిల్ కాంట్రాక్టర్ల దౌర్జన్యం

ఫర్టిలైజర్‌సిటీ, డిసెంబర్ 30: సింగరేణిలో సివిల్ కాంట్రాక్టర్లు రింగై తోటి గుమస్తాపై దౌర్జన్యానికి దిగిన ఘటన శనివారం గోదావరిఖనిలో జరిగింది. ఆర్జీ–1 పరిధిలో సింగరేణి ప్రైమరీ స్కూల్ మరమ్మతు కోసం యాజమాన్యం టెండర్లు పిలిచింది. 40 మంది సివిల్ కాంట్రాక్టర్లు సిండికేట్‌గా మారారు. ఇందులోని నలుగురు గుమస్తాలు వీరగంటి నరేందర్, సీహెచ్ విజయ్‌కుమార్, మారం సమ్మయ్య, నరేశ్ టెండర్లు దాఖలు చేశారు. ఈ క్రమంలో సిండికేట్‌గా మారిన కాంట్రాక్టర్లు మార్కండయకాలనీలోని నరేందర్ ఇంటికి వెళ్లి దాడికి దిగారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అయోధ్య అక్షింతలతో శోభాయాత్ర

కాల్వశ్రీరాంపూర్/జూలపల్లి, డిసెంబర్30: అయోధ్య రామజన్మ భూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ నుంచి కాల్వశ్రీరాంపూర్, జూలపల్లికి శనివారం అక్షింతలు చేరుకున్నాయి. ఈ సందర్భంగా అయోధ్య అక్షింతలతో కాల్వశ్రీరాంపూర్, జూలపల్లిలో గ్రామస్తులు శోభాయాత్ర నిర్వహించారు.

ప్రజాపాలనకు దరఖాస్తుల వెల్లువ

- మూడో రోజు జిల్లా వ్యాప్తంగా 39, 802 దరఖాస్తులు
- అభయ హస్తం దరఖాస్తులు 34, 518
- ఇతర అర్జీలు 5284

పెద్దపల్లి/పెద్దపల్లి టౌన్/ మంథని/కమాన్‌పూర్/ రామగిరి/ ముత్తారం/ జ్యోతినగర్/కాల్వశ్రీరాంపూర్ / యైటింక్లయిన్‌కాలనీ/జూలపల్లి/ ధర్మారం/ సుల్తానాబాద్ డిసెంబర్ 30: జల్లా వ్యాప్తంగా ప్రజాపాలన వార్డు, గ్రామసభలకు శనివారం దరఖాస్తులు వెల్లువెత్తాయి. అభయ హస్తం (ఆరు గ్యారెంటీలు), ఇతర సమస్యలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. శనివారం పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ మున్సిపాలిటీలతో పాటు రామగుండం కార్పొరేషన్ పరిధిలో 17 వార్డు సభలు, 13 మండలాల పరిధిలోని 45 జీపీల్లో గ్రామ సభలు నిర్వహించి 39, 802 దరఖాస్తులు స్వీకరించినట్లు అధికారులు వెల్లడించారు. ఇందులోఅభయ హస్తం దరఖాస్తులు 34, 518, ఇతర దరఖాస్తులు 5, 284 ఉన్నాయి. మూడు రోజుల్లో జిల్లా వ్యాప్తంగా ్ల దరఖాస్తులు 97, 854 అందాయి. కాగా శనివారం పెద్దపల్లి 13, 15 వార్డుల్లో నిర్వహించిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ పాల్గొని